14) శ్లో॥1: ఊర్ధ్వ మూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥
(ప్రకృతి, పురు షుడు)

**భావము :** పైకి వేర్లు క్రిందికి కొమ్మలు గల అశ్వర్థమనే వృక్షము అవ్యయమైనదని, వేదములు ఆకులుగ ఉన్నవని ఎవడు తెలియునో వాడు వేదములు తెలిసినవాడని చెప్పవచ్చును.

**వివరము :** ఒక వృక్షమునకు వేర్లు, మొదలు, కొమ్మలు, ఆకులు, ఫలములు ఉండుట సహజము. ఇక్కడ మనము చెప్పుకొను అశ్వర్థమనబడు దానికి వేర్లు (మూలము), కొమ్మలు (శాఖలు), ఆకులు ,ఫలములు గలవు కావున వృక్షములాంటి పోలికలున్నవి. కనుక ఒక విధముగ అర్థమగుటకు వృక్షమని చెప్పుకోవచ్చును. వాస్తవానికిది వృక్షముకాదని తెలియాలి. సాధారణముగ వృక్షమునకు వేర్లు క్రింద భూమిలో, కొమ్మలు పైన ఉంటూ కొమ్మలకు ఆకులు అందముగ కనిపిస్తుంటాయి. అలాగే వృక్షము పెరుగుటకు భూమి నుండి వేర్లు ఆహారమును గ్రహించి పెట్టుచున్నవి. వేర్లు నుండి గ్రహించిన ఆహారమును ఆకులు ఉపయోగించుకొని చెట్టు పెరుగుచు పైకి క్రిందికి దిశలకు కొమ్మలు ప్రాకియుండుట మనము చూస్తూనే ఉన్నాము. కాని ఇక్కడ చెప్పబడు అశ్వర్థమనబడు వృక్షము పైకి వేర్లు, క్రిందికి కొమ్మలు కలదిగ ఉండడము విచిత్రము. అశ్వర్థమనబడు వృక్షము పెరుగుటకు కావలసిన సదుపాయములన్ని పైనున్న మూలము నుండి లభిస్తున్నవి. ఆకులు, కాయలకు కావలసిన ఆహారము పైనున్న మూలము నుండి లభిస్తు చెట్టు పెరుగుచూ పోయి దృఢముగ వ్యాపించుకొన్నది. చెట్టు నిర్మాణములోనే విచిత్రముకాగ, ఫలములు కాయడములో కూడ సాధారణ చెట్టుకంటే మరీ విచిత్రముగ ఉండును. సాధారణముగ మామిడి చెట్టుకు మామిడి కాయలు కాయడము సహజము. అలాగే ఏ జాతి చెట్టుకు ఆ జాతి కాయలు కాయడము అందరికి తెలిసిన విషయమే. కాని అశ్వర్థవృక్షమనబడు దానికి ఒక విధమైన కాయలు కాయవు. ఈ చెట్టుకు అనేక విధములగు ఫలములు కాయుచున్నవి. ఈ అశ్వర్థవృక్షము ఆకారములోనేకాక కాయలలో విచిత్రముగ ఉండగ, కాయలలోనేకాక ఆకులలో కూడ విచిత్రముగనే ఉన్నదని చెప్పవచ్చును. అదేమిటంటే దీని ఆకులు వేదములకు ప్రతిరూపములు. వేదములే ఆకులుగ ఉన్న ఈ చెట్టును తెలిసినవాడు నిజముగ వేదములు తెలిసినవాడని చెప్పవచ్చును.